www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 29 ఏప్రిల్ 2023
5
ఏలూరు



స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు

ఏలూరు: స్పందన దరఖాస్తులను నాణ్యమైన రీతిలో పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, సిఎం జగన్‌కు వివరించారు. స్పందన, పేదలందరికీ ఇళ్లు, జగనన్న భూహక్కు, భూరక్ష, నాడు-నేడు కార్యక్రమాల ప్రగతిపై కలెక్టర్లు, ఎస్‌పిలతో శుక్రవారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య మిస్తుందని, ఈ కార్యక్రమాన్ని మరింత మెరుగుపరిచేందుకు వచ్చేనెల తొమ్మిదో తేదీ నుంచి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం 1952 హెల్ప్ లైన్ నెంబర్‌ను ఏర్పాటు చేశామని, ప్రజలు తమ స్పందన దరఖాస్తు పరిష్కార విధానంపై ఫోన్ చేయొచ్చన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్పందన కార్యక్రమం ద్వారా అందిన దరఖాస్తులు రీఓపెన్ కాకుండా దరఖాస్తుదారుడు సంతృప్తికరమైన రీతిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కీలక పోస్టుల్లో ఇన్‌ఛార్జులే..!

వైద్యం, పంచాయతీ, ఐటిడిఎ వంటి అనేక శాఖల్లో ఇన్‌ఛార్జి అధికారులే

జిల్లాస్థాయి పోస్టుల భర్తీకి వెంటాడుతున్న అధికారుల కొరత

గృహనిర్మాణ శాఖలోనూ అదే పరిస్థితి రానుందా?

ఆ శాఖ జిల్లా అధికారిని మార్చనున్నట్లు ప్రచారం సర్వత్రా చర్చనీయాంశం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పలుశాఖల్లో జిల్లాస్థాయి అధికారి పోస్టులు ఇన్‌ఛార్జీలతోనే నెట్టుకొస్తున్న పరిస్థితి ఉంది. ఇది పాలనపై తీవ్ర ప్రభావం చూపుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో జిల్లా గృహనిర్మాణశాఖ అధికారిని మార్చనున్నట్లు సాగుతున్న ప్రచారం సర్వత్రా చర్చనీయాంశమైంది. అసలు అధికారుల మార్పు వెనుక ఏం జరుగుతుందనే చర్చ సాగుతోంది. ఏలూరు జిల్లాలో ఏజెన్సీ ప్రాంతం ఉంది. వైద్యపరంగా అనేక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఆ శాఖ ఇన్‌ఛార్జి అధికారి పాలనలోనే నడుస్తోంది. జిల్లాలో మరో కీలకమైంది పంచాయతీశాఖ. ఇక్కడ సైతం ఇన్‌ఛార్జి అధికారే ఉన్నారు. గడిచిన ఏడాదిలో ఈ శాఖలో ముగ్గురు అధికారులు మారిన పరిస్థితి నెలకొంది. మెట్ట ప్రాంతంలో అత్యంత ప్రధానమైన ఉద్యాన శాఖాధికారి కూడా ఇన్‌ఛార్జినే ఉన్నారు. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో అతిముఖ్యమైన ఐటిడిఎను కూడా కొంతకాలంగా ఇన్‌ఛార్జి అధికారి పాలనలోనే నెట్టుకొస్తున్నారు. ఇలా చెప్పుకుంటేపోతే ఏలూరు జిల్లాలో దాదాపు పదికిపైగా శాఖల్లో జిల్లా అధికారులుగా ఇన్‌ఛార్జులే ఉన్నట్లు తెలుస్తోంది. ఏలూరు జిల్లాలో 27 మండలాలు ఉన్నాయి. జిల్లాలో మెట్ట, ఏజెన్సీ ప్రాంతం ఎక్కువగా ఉంది. ఇక్కడి ప్రజలకు ప్రభుత్వ పథకాలుగాని, సంక్షేమ ఫలాలుగాని సక్రమంగా అందాలంటే సమర్థులైన జిల్లా అధికారుల అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే సెకండ్ గ్రేడ్ ఉద్యోగులను జిల్లా అధికారిగా నియమించినా నిర్ణయాలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తున్న పరిస్థితి ఉంది. అంతేకాకుండా ఆ శాఖలో పనిచేస్తున్న కిందిస్థాయి అధికారులు ఇన్‌ఛార్జి అధికారుల మాట సక్రమంగా వినే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో సకాలంలో పనులు జరగని పరిస్థితి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇన్‌ఛార్జీగా ఉన్న అధికారి నిర్ణయాలు తీసుకోవడంలోను తడబాటు కన్పిస్తోంది. ఏదైనా నిర్ణయం తీసుకుంటే తమ పైఅధికారుల నుంచి ఎటువంటి ఇబ్బందులు వస్తాయోననే భయం వారిని వెంటాడుతోంది. అదే జిల్లాస్థాయిలో రెగ్యులర్ అధికారి ఉంటే నిర్ణయాలు వేగంగా తీసుకునే అవకాశం ఉంటుంది. ఉన్నతాధికారులతో మాట్లాడి తమకు కావాల్సిన నిధులు రాబట్టుకునే సమర్థత ఉంటుంది. ఇన్‌ఛార్జీల ఏలుబడిలో జిల్లాపాలన కుంటుపడుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. జిల్లాస్థాయి అధికారుల పోస్టులు భర్తీ కాకపోవడానికి కారణాలు ఏమైనా ఉన్నాయా.. ఇక్కడికి అధికారులు వచ్చేందుకు ఇష్టపడకపోవడానికి కారణాలు ఏమిటనే చర్చ సైతం నడుస్తోంది. సెకండ్ గ్రేడ్ అధికారులైతే తమ మాట తూచ తప్పకుండా పాటిస్తారనే అభిప్రాయంతో జిల్లా ఉన్నతాధికారులు ముందుకు సాగుతున్నారా అనే ప్రచారం సైతం నడుస్తోంది. ఏదేమైనా జిల్లాస్థాయి పోస్టుల్లో ఇన్‌ఛార్జులు ఉండటం పాలనాపరంగా ఇబ్బందికరమే.

అదేబాటలో గృహ నిర్మాణ శాఖ..?

జిల్లాస్థాయిలో అతిముఖ్యమైన శాఖల్లో గృహనిర్మాణశాఖ ఒకటి. ప్రస్తుతం ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తున్న అతిముఖ్యమైన పథకాల్లో గృహనిర్మాణం ప్రధానమైంది. జగనన్న లేఅవుట్లలో ఇళ్లనిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ప్రస్తుతం గృహనిర్మాణ శాఖ అధికారిగా ఉన్న వేణుగోపాల్ సమర్థుడైన అధికారిగా పేరొందారు. ఆ శాఖపై మంచి పట్టున్న అధికారిగా ప్రజాప్రతినిధులే చెబుతున్న పరిస్థితి ఉంది. అలాంటి అధికారిని మార్చబోతున్నట్లు గడిచిన రెండురోజులుగా ప్రచారం సాగుతోంది. ఏలూరు జిల్లాలో టార్గెట్‌కు అనుగుణంగా గృహనిర్మాణాలు పూర్తిచేయడంలోనూ ఆయన ముందున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. లబ్ధిదారులకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటూ పరిష్కరించే అధికారిగా పేరుంది. అలాంటి అధికారిని ఎందుకు మారుస్తున్నారనే చర్చ రాజకీయ నాయకుల్లోనూ, ఉద్యోగుల్లోనూ సాగుతోంది. దీనివెనుక ఏమైనా అంతర్గత కారణాలు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పలుశాఖలను ఇన్‌ఛార్జి అధికారులతోనే నెట్టుకొస్తున్నారు. ఇప్పుడు అత్యంత ప్రధానమైన శాఖ అధికారి కూడా వెళ్లిపోతే గృహనిర్మాణం కుంటుపడే పరిస్థితి ఏర్పడనుంది. ప్రస్తుత అధికారి వేణుగోపాల్‌ను కొనసాగించాలని ప్రజాప్రతినిధులు పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది.



ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

ధాన్యం కొనుగోలు సమస్యలపై అన్నదాతల నిరసన

రవాణాకు లారీలు, గోనె సంచులు పంపాలని డిమాండ్

ప్రజాశక్తి - భీమడోలు

ధాన్యం రవాణాకు లారీలు పంపాలని, రైతులకు సరిపడా గోనె సంచులు ఇవ్వాలంటూ ఎంపి రైతు సంఘం ఆధ్వర్యంలో భీమడోలు సహకార సొసైటీ ముందు శుక్రవారం రైతులు, కౌలు రైతులు ధర్నా నిర్వహించారు. ధాన్యం కొనుగోలు సమస్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండుటెండలో అన్నదాతలు నిరసన వ్యక్తం చేశారు. ఉదయం ఎనిమిది గంటల నుండి ఒంటిగంట వరకూ సహకార సొసైటీ ముందు పడిగాపులు పడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు దిగారు. ధాన్యం కొనుగోలులో అధికారులు నిర్లక్ష్య వైఖరి వీడాలని, ధాన్యం రవాణాకు లారీలు పంపాలని, గోనె సంచులు ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భీమడోలు మండలంలోని మూడు రైతు భరోసా కేంద్రాల పరిధిలో 1600 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేయగా 1550 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయని చెప్పారు. 16,467 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా ఇప్పటివరకూ 2752 టన్నులు మాత్రమే ధాన్యం కొనుగోలు చేశారని చెప్పారు. రైతులకు రెండు లక్షల 18 వేల గోనె సంచులు ఇవ్వగా 60 వేల గోనె సంచుల ధాన్యాన్ని మాత్రమే మిల్లులకు తరలించారన్నారు. మిగిలిన 1,58,000 గోనె సంచల ధాన్యం కల్లాల్లో ఉండిపోయిందన్నారు. రోజుకు ఒకటి, రెండు లారీలు మాత్రమే ఏర్పాటుచేసి అధికారులు చేతులు దులుపుకోవడం దారుణమని విమర్శించారు. సరిపడా లారీలు వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన ధాన్యంలో సగం ధాన్యం మాత్రమే కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించారని చెప్పారు. లక్ష్యం పూర్తికావడంతో మిగిలిన ధాన్యానికి గోనె సంచులు ఇవ్వకపోవడంతో ఆరుదలకు వచ్చిన ధాన్యం పట్టుబడులు జరగక రైతులు, కౌలు రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని చెప్పారు. భీమడోలు పరిధిలో మరో రెండు లక్షల గోనె సంచులు అవసరం ఉందన్నారు. కొనుగోలు ఆలస్యం అవ్వడం వల్ల నూక శాతం పెరిగిపోతోందని అందుకు రైతులనే బాధ్యులను చేసి మిల్లర్లు డబ్బులు వసూలు చేయడం అన్యాయమన్నారు. నూక శాతం పేరుతో డబ్బులు వసూలు ఆపాలని కోరారు. అనంతరం రైతు సంఘం నాయకులు భీమడోలు మండల తహశీల్దార్‌కు ఫోన్ చేయగా ధాన్యం కొనుగోలు సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కటారి మురళీకృష్ణ, కిలారి వెంకట్రావు, కొత్తపల్లి కనకరాజు, బండారు సుబ్బారావు, ఎం.శ్రీనివాసరావు, బొప్పన రాంబాబు, తోట రాంబాబు, బూర్లు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అందరి అంచనాలకు తగ్గట్టుగా 'ఉగ్రం'

ఆదరించాలని చిత్రం హీరో అల్లరి నరేష్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


మాట్లాడుతున్న హీరో అల్లరి నరేష్

వచ్చేనెల ఐదో తేదీన విడుదల కానున్న 'ఉగ్రం' సినిమాను అందరూ ఆదరించాలని సినీ హీరో అల్లరి నరేష్ కోరారు. శుక్రవారం స్థానిక అతిథి హోటల్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఉగ్రం' సినిమా తన 60వ సినిమా అని, ఇప్పటివరకూ కామెడీ సినిమాలకే పరిమితమైన తాను సీరియస్, యాక్షన్ సినిమా చేస్తే చూస్తారా అనే భయం గతంలో ఉండేదని, 'నాంది' సినిమా హిట్ అయిన తర్వాత ఆ భయం పోయిందన్నారు. ఉగ్రం సినిమా స్క్రిప్ట్ తయారు చేసేందుకే ఏడాదిన్నర పట్టిందని, లాక్ డౌన్ సమయంలో దేశవ్యాప్తంగా లక్షా 50 వేల మంది కనిపించకుండా పోయారనే అంశాన్ని కథగా తీసుకుని ఈ చిత్రం నిర్మించామని తెలిపారు. దర్శకుడు విజయ్ ఆధ్వర్యంలో 'నాంది' సినిమా టీముతోనే ఈ చిత్రం ఎంతో కష్టపడి నిర్మించామని, ప్రేక్షకులు కూడా ఈ సినిమాపై ఎన్నో అంచనాలతో ఉన్నారని, వారి అంచనాలకు తగ్గట్టుగా చిత్రం ఉంటుందని ఆయన తెలిపారు. ఇప్పటి వరకూ కామెడీకే పరిమితమైన తన ఆలోచనలు మారాయని, యాక్షన్ చిత్రాలు అందుకే చేస్తున్నానని, అలా అని యాక్షన్ చిత్రాలకే పరిమితం కానని, తర్వాత కామెడీ చిత్రం చేస్తానని, కామెడీ, సీరియస్ రెండు బ్యాలెన్స్ చేసుకుంటూ వెళ్తానని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న హీరోయిన్ మిర్న మీనన్ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే అంశాలతో నిర్మించిన ఈ సినిమాను అందరూ తప్పక చూసి ఆదరించాలని కోరారు. ఈ చిత్రంలో నటించిన మరో నటుడు సాయి మాట్లాడుతూ మూడు రోజులపాటు ఈ చిత్ర ప్రమోషన్స్ కోసం తిరుగుతున్నామని ఏలూరు నుంచి ప్రమోషన్ ప్రారంభించామని తెలిపారు. ట్రైలర్ పాజిటివ్‌గా ఉందని చిత్రం విజయవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎక్స్‌రే యూనిట్ ఏర్పాటు చేయాలని ఆందోళన

జంగారెడ్డిగూడెం: స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రిలో రోగుల సౌకర్యార్థం ఎక్స్‌రే నూతన యూనిట్‌ను ఏర్పాటు చేయాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు కోరారు. శుక్రవారం ఆసుపత్రి వద్ద టిడిపి నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్యామ్‌చంద్ర శేషు మాట్లాడుతూ వంద పడకల ఏరియా ఆసుపత్రిలో ఎక్స్‌రే విభాగం మొన్నటి వరకూ సిబ్బంది లేక, పని చేయకపోతే నేడు వంద పడకల ఆసుపత్రి స్థాయికి తగిన మిషనరీ లేదన్నారు. ఇప్పుడున్న మిషనరీ కేవలం వంద ఎంఎ సామర్థ్యం కలిగిన మిషనరీ అని దానివల్ల రోజుకు కేవలం 15 మందికి మాత్రమే ఎక్స్‌రే తీయగలరని తెలిపారు. ఆసుపత్రి సామర్థ్యానికి 300 ఎంఎం సామర్థ్యం గల మిషనరీని ఏర్పాటు చేయాలని కోరారు. స్థానిక శాసనసభ్యులు ఆసుపత్రి కమిటీ ఛైర్మన్‌గా ఉన్నారని, ఆయన తక్షణం స్పందించి మిషనరీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీనికి జిల్లా ప్రభుత్వ వైద్యాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో సిబ్బంది లేక మూతబడిన సందర్భంలో టిడిపి తరపున సాధించుకున్న విభాగాన్ని తెరిపించాలని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఐదో వార్డ్ కౌన్సిలర్ కరుటూరి రమాదేవి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, నియోజకవర్గ తెలుగు యువత నాయకులు కోండ్రు నాగరాజు, పట్టణ తెలుగు యువత ఉపాధ్యక్షులు మల్లిపూడి నవీన్, 11వ వార్డ్ నాయకులు శేఖర్ పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు గ్రామస్థాయి టాస్క్ ఫోర్సు కమిటీలు

జీలుగుమిల్లి: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకోసం ప్రభుత్వం గ్రామస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు సచివాలయాల శాఖ సామాజిక ప్రవర్తన మార్పు సమాచార విభాగం జిల్లా కో ఆర్డినేటర్ టివిఎన్.స్నేహన్ చెప్పారు. ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ ఐదు ప్రధాన లక్ష్యాల సాధనకు ప్రత్యేక దృష్టిసారించేందుకు గ్రామ సామాజిక ఆరోగ్య అధికారి, టీం లీడర్‌గా వ్యవహరించాలని ఆదేశాలున్నాయని చెప్పారు. గురువారం స్థానిక పిహెచ్‌సిలో టాస్క్‌ఫోర్స్ కమిటీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, యుక్త వయసు బాలల ఆరోగ్యంపై దృష్టిసారించాలని చెప్పారు. యుక్త వయసు బాలికలకు క్రమం తప్పకుండా రక్త శాతం పరీక్షలు నిర్వహించాలన్నారు. ఇవన్నీ సక్రమంగా నిర్వహించేందుకు గ్రామస్థాయి టాస్క్ ఫోర్సు కమిటీ ఏర్పాటు చేయాలని, జిఒ నెంబర్ 34 జారీ చేశారని చెప్పారు. ఈ కమిటీలో ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, పాఠశాల ఆరోగ్య అంబాసిడర్, గ్రామ సంఘం అధ్యక్షులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిస్థితులను మెరుగుపరిచేందుకు, రోగులకు సేవలు చేయడం వంటి పనులు ఈ కమిటీ చూడాలన్నారు. ప్రతినెలా కమిటీ సమావేశమై సమీక్షించాలని సూచించారు.

సాయిష్ అంత్యక్రియలు పూర్తి

పాలకొల్లు: అమెరికాలో గత వారం దుండగుల కాల్పుల్లో మృతి చెందిన పాలకొల్లుకు చెందిన వీరా సాయిష్ మృతదేహానికి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. అతని మృతదేహం గురువారం సాయంత్రం ఏలూరులోని నివాసానికి చేరింది. అనంతరం పాలకొల్లుకు తరలించారు. దీంతో నాగరాజుపేటలోని తాతయ్య, సీనియర్ జర్నలిస్టు వీర సత్యం స్వగృహం వద్ద విషాదఛాయలు అలుముకున్నాయి. సాయిష్ మృతదేహాన్ని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు సందర్శించి, అతని కుటుంబానికి సానుభూతి తెలిపారు.

హామీల అమల్లో బిజెపి విఫలం

ప్రజాశక్తి - చింతలపూడి



మాట్లాడుతున్న డిఎన్‌విడి.ప్రసాద్

బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని, ఏటా నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానన్న మోడీ ఎన్ని లక్షల ఉద్యోగాలు ఇచ్చారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య ప్రశ్నించారు. పట్టణంలోని ఫైర్‌స్టేషన్ వద్ద మోడీని గద్దె దించండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ, సిపిఎం చేపట్టిన ప్రచార భేరి యాత్ర ముగింపు సభ సిపిఎం మండల కన్వీనర్ ఆర్‌వి.సత్యనారాయణ, సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలుపరుస్తామని చెప్పి నాలుగు నల్లచట్టాలను తీసుకువచ్చి రైతులను మోసం చేస్తే రైతాంగం తిరుగుబాటుతో వాటిని వెనక్కి తీసుకున్నారన్నారు. స్వతంత్ర్యం రాకముందు నుంచే కార్మికులు తెచ్చుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చారని, ప్రభుత్వరంగ సంస్థలన్నీ ప్రయివేటుపరం చేస్తూ కార్పొరేట్ కంపెనీలకు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కును ప్రయివేటీకరిస్తూ ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలను అమలు చేయకుండా పోలవరం నిర్మాణానికి నిధులు కేటాయించకుండా మోడీ అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ అన్యాయాన్ని అధికార వైసిపిగానీ, ప్రతిపక్ష టిడిపిగానీ కనీసం విమర్శించకపోవడం దారుణమన్నారు. బిజెపి ప్రజావ్యతిరేకవిధానాలపై ప్రజలంతా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రచార భేరి ముగింపుసభలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సిపిఎం నాయకులు అన్నవరం, ఎస్.సూర్యకుమార్, చంద్రశేఖర్ రెడ్డి, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు పుల్లూరి సోమశేఖర్, టి.బాబు, సిపిఐ మండల కమిటీ సభ్యులు జంగా రామచంద్రారెడ్డి, ఎస్‌కె.జానీ, మస్తాన్, కాలేషా, ఐద్వా నాయకులు వరలక్ష్మి, అనురాధ పాల్గొన్నారు.

హేలాపురి వేసవి ఉత్సవానికి పేర్లు నమోదు చేసుకోండి

ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు, ఎంఎల్‌సి షేక్ సాబ్జీ - 30న నిర్వహణ

ప్రజాశక్తి - ఏలూరు

ఈనెల 30వ తేదీన నిర్వహిస్తున్న హేలాపురి వేసవి ఉత్సవానికి ఆసక్తిగలవారు పేర్లు నమోదు చేసుకోవాలని హేలాపురి వేసవి ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు, ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, అధ్యక్షులు ఎస్.కస్తూరిరావు, ప్రధాన కార్యదర్శి అడుసుమిల్లి నిర్మల, కోశాధికారి ఎబి.త్రిపురసుందరి తెలిపారు. ఏలూరు నగరం, ఏలూరు పరిసర ప్రాంత గ్రామాల ఎల్‌కెజి, యుకెజి విద్యార్థులు, ఒకటి, రెండు తరగతుల విద్యార్థులు, కళాశాల విద్యార్థినులు, 25 నుండి 60 మధ్య వయస్సు గలవారు, 60 సంవత్సరాలు పైబడిన సీనియర్ సిటిజన్స్ పేర్లు నమోదు చేసుకోవాలని వారు సూచించారు. పవర్ పేటలోని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో హేలాపురి వేసవి ఉత్సవ ఆహ్వానపత్రికను సాబ్జీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9440441955, 7416671480, 9493986883 నెంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వేసవి ఉత్సవంలో పాల్గొనేవారికి 29 అంశాల్లో ప్రతిభాపాటవ ప్రదర్శనకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రతి అంశంలోనూ ముగ్గురు చొప్పున ఉత్తమ ప్రతిభాపురస్కారాలు, ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేస్తామన్నారు. హేలాపురి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరు నగరంలోని 20 సంఘాలు, సంస్థలు సంయుక్తంగా వేసవి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని, అందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. పాల్గొనడానికి వచ్చేవారికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. దాతలు ఈ కార్యక్రమం జయప్రదానికి ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వేసవి ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఎస్.కస్తూరిరావు మాట్లాడుతూ 20 కమిటీలు పనిచేస్తున్నాయన్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శి అడుసుమిల్లి నిర్మల మాట్లాడుతూ ఏలూరు నగరంలో వందలాది అపార్ట్‌మెంట్లలో 150 విద్యాలయాలకు, వివిధ సంఘాల సభ్యులకు కరపత్రాలు, పోస్టర్లు బ్యానర్ల ద్వారా ప్రచారం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, సభ్యులు విజయ, ఆర్.కృష్ణారావు, వై.ఆనందనాయుడు, రత్నాకర్‌రావు, శ్రీహరికోటి, పి.ఆంజనేయులు, బి.వరలక్ష్మి, ఎ.మోహిని, మేతర అజయ్‌బాబు, పి.హైమావతి, జి.శారద, ఉష, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు అనుమతి

ఏలూరు ప్రతినిధి: ఏలూరు మెడికల్ కాలేజీలో ఈ ఏడాది నుంచి తరగతుల ప్రారంభం కానున్నాయి. అందుకు సంబంధించి నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుంచి అనుమతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు ఈ ఏడాది నుంచి 150 సీట్లతో తరగతులు ప్రారంభం కానున్నాయి. వచ్చే ఆగస్టు నుంచి విద్యార్థులు తరగతులకు హాజరు కానున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిని మెడికల్ కాలేజీగా మార్పు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అప్పటినుంచి ఆసుపత్రిలో అనేక మార్పులు చేసింది. డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయాల ఆవరణలో కాలేజీని నిర్మిస్తున్నారు. మెడికల్ కాలేజీ ప్రారంభంతో అంతటా హర్షం వ్యక్తమవుతుంది. గత కొంతకాలంగా జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సరైన వైద్య సేవలు అందని పరిస్థితి ఉంది. ప్రజలకు మంచి వైద్య సేవలందేలా చూడాలని జనం కోరుతున్నారు.

మార్చురీలో మృతదేహంపై ఎలుకల దాడి

బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - చింతలపూడి


మృతదేహంపై ఎలుకల దాడి గాయాలు (సర్కిల్లో)

మార్చురీలో కనీస వసతుల్లేకపోవడంతో మృతదేహాన్ని ఎలుకలు కొట్టిన సంఘటన చింతలపూడి ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం చోటుచేసుకుంది. దీనిపై బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బోయగూడేనికి చెందిన పి.కృష్ణవేణి గురువారం సాయంత్రం తనకు పిల్లలు పుట్టడం లేదని మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడింది. బంధువులు గమంచిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతిచెందిందని తెలిపారు. రాత్రి కావడంతో మరుసటిరోజు శుక్రవారం పోస్టుమార్టం చేస్తామని చెప్పి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఉదయం మృతదేహాన్ని చూసేందుకు బంధువులు మార్చురీకి వెళ్లారు. అయితే మృతదేహాన్ని పలుచోట్ల ఎలుకలు తీవ్రంగా కొరికాయి. దీంతో వారు అగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని, మార్చురీలో కనీస వసతులు కూడా లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మృతదేహాన్ని ఎలుకలు కొరకలేదని, అవాస్తవాలు ప్రచారం చేయొద్దని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రసూల్ అన్నారు. వార్డు బోయ్ పలుమార్లు వెళ్లి ఫ్రీజర్ బాక్స్ చూశాడని, బాక్స్ వల్ల గాయం అయి ఉండొచ్చని, ఎలుకలు కొరికితే దంత గుర్తులుంటాయని, అలాంటికి లేవని చెప్పుకొచ్చారు.


మృతదేహాన్ని పరిశీలించిన తహశీల్దార్ కృష్ణజ్యోతి

మార్చురీలోని మృతదేహ్నా తహశీల్దార్ కృష్ణజ్యోతి పరిశీలించారు. మార్చురీలో సరైన వసతుల్లేవని, ఈ విషయాన్ని జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

భార్యను నరికి చంపిన కసాయి భర్త

ఆపై పురుగుల మందు తాగి ఆత్మహత్య -అనాధలైన ముగ్గురు పిల్లలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


కుటుంబ సభ్యులు (ఫైల్‌ఫొటో)

భార్యను నరికి చంపి, ఆపై భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గంజి నిర్మల (35), దావీదు భార్యాభర్తలు. వీరికి పదేళ్లలోపు వయస్సున్న ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడం, కుటుంబం గడవడం కష్టంగా మారడంతో పిల్లలను తన పుట్టింట్లో ఉంచి నిర్మల ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లింది. ఈ క్రమంలో తనకు డబ్బు పంపడం లేదని కుమార్తెలను తన ఇంటికి తీసుకొచ్చి చిత్రహింసలు పెట్టి వీడియో తీసి దావీదు తన భార్య నిర్మలకు పంపాడు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తాడేపల్లిగూడెం రూరల్ పోలీసులు దావీదును అరెస్టు చేసి జైలుకు పంపారు. ఈ క్రమంలో నిర్మల గల్ఫ్ నుంచి తిరిగొచ్చి పెంటపాడులోని కూనాగరపేటలోని పుట్టింట్లో ఉంటోంది. దావీదు రెండు నెలల క్రితం జైలు నుంచి బయటికొచ్చాడు. మూడు రోజుల క్రితం పెంటపాడు వచ్చిన దావీదు తాను మారిపోయానని, భార్యను, పిల్లలను బాగా చూసుకుంటానని చెప్పి నిర్మలను వీరంపాలెం తీసుకెళ్లాడు. పిల్లలు వేసవి సెలవుల నేపథ్యంలో కొయ్యలగూడెం బంధువుల ఇంటికెళ్లారు. గురువారం రాత్రి మరోసారి నిర్మల, దావీదు నడుమ ఘర్షణ చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున మూడున్నర గంటల ప్రాంతంలో నిర్మలను దావీదు కత్తితో విచక్షణారహితంగా మెడపై నరికాడు. రెండు చేతులు, మణికట్టుపైనా ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం దావీదు పక్కనే ఉన్న చెరకుతోటలోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. ఈ విషయం తెలుసుకున్న దావీదు కుటుంబీకులు హుటాహుటీన తాడేపల్లిగూడెం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని భీమవరం డిఎస్‌పి బండారు శ్రీనాథ్, సిఐ మూర్తి, రూరల్ ఎస్ఐ భద్ర సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ మూర్తి తెలిపారు.

కార్పొరేషన్‌లో పన్నుల దోపిడీ : టిడిపి

ఏలూరు అర్బన్: ఏలూరు కార్పొరేషన్ పరిధిలో విలువ ఆధారిత పన్ను పేరుతో ఆస్తి పన్ను భారీగా పెంచి, నగర ప్రజలను దోచుకునేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారంటూ ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బడేటి చంటి ధ్వజమెత్తారు. అశాస్త్రీయంగా ఆస్తి పన్ను పెంపు, విలీన గ్రామాల్లో భారీగా తాగునీటి పన్ను పెంపునకు నిరసనగా టిడిపి ఆధ్వర్యంలో ఏలూరు కార్పొరేషన్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ 2021 నుంచి విలువ ఆధారిత పన్ను అమల్లోకి వచ్చిందని, అప్పటినుంచి ఏటా 15 శాతం మేర ఆస్తి పన్ను పెంచుతూ ఈ ప్రభుత్వం ప్రజలపై అదనపు భారాన్ని మోపిందని ధ్వజమెత్తారు. వాస్తవానికి 15 శాతం కంటే అదనంగా మరో ఐదు శాతం పెంచుతున్నారని, దీనివల్ల ఆస్తి విలువ కంటే పన్ను మొత్తం అధికంగా ఉంటుందని ఆయన విమర్శించారు. విలువ ఆధారత పన్ను విధానం చూసి ప్రజలు వణికిపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు ఏలూరు కార్పొరేషన్‌లోకి విలీనమైన ఏడు గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండానే అక్కడి స్థానికులపై కార్పొరేషన్ పాలకులు, అధికారులు పన్నుల భారం వేయడం దారుణమని పేర్కొన్నారు. 250 రూపాయలు ఉన్న ఆస్తి పన్నును ఒక్కసారిగా రూ.700కు పెంచారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విలీన గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించకుండానే నీటి పన్నును పెంచడం దారుణమని బడేటి చంటి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఏలూరు కార్పొరేషన్ అవినీతి కూపంగా మారిందని విమర్శిం జరుగుతోందని ఆరోపిస్తే అతన్ని పార్టీ నుండి సస్పెండ్ చేశారని, అయితే ఇటీవల అతన్ని తిరిగి పార్టీలోకి చేర్చుకోవడం వెనుక అర్థం ఏమిటో అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్పొరేటర్లు నాయుడు పృధ్వీశారదాసోము, వందనాల భవానిశ్రీనివాస్, టి.అరుణసురేష్, పాలి ప్రసాద్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు వచ్చేవారికి న్యాయం చేయాలి

ఆగిరిపల్లి: పోలీస్‌స్టేషన్‌కు పలు సమస్యలపై వచ్చే ప్రజలకు పరిష్కారం చూపి, న్యాయం చేయాలని ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి పోలీసులకు సూచించారు. శుక్రవారం ఆమె ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు పుష్పగుచ్ఛంతో ఎస్‌పికి స్వాగతం పలికారు. పోలీస్‌స్టేషన్ నూతన భవనం చాలా సౌలభ్యంగా ఉందని ఆమె కితాబిచ్చారు. పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులతో మాట్లాడి వారి సాధకబాధలు తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ నిర్వహణ పట్ల ఆమె సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో నూజివీడు డిఎస్‌పి ఇ.అశోక్ కుమార్ గౌడ్, నూజివీడు రూరల్ సిఐ ఆర్.అంకబాబు పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

కేసుల రాజీకి కృషి చేయాలి


ఏలూరు అర్బన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి ఏలూరు సబ్ డివిజన్‌లోని ఎస్ఐలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో త్వరలో జరిగే నేషనల్ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె పోలీసు అధికారులతో మాట్లాడుతూ రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసుల్లో కక్షిదారులకు కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. రాజీ వల్ల కలిగే లాభాలను కక్షిదారులకు తెలియజేసి కేసుల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. అలాగే డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పైడేశ్వరావు పోలీస్ అధికారులకు కేసుల సత్వర పరిష్కారానికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కెకెవి.బుల్లి కృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఉచితంగా ర్యాబిస్ నివారణ టీకాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పశు వైద్య దినోత్సవం సందర్భంగా శనివారం ఉచితంగా ర్యాబిస్ నివారణ టీకాలు వేయనున్నట్లు పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ ఎ.సాయి బుచ్చారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు వైద్య దినోత్సవం సందర్భంగా రాబీస్ నివారణ టీకాలు వేయనున్నట్లు ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న కె.శ్రీనివాసరావు

ఉచిత కంప్యూటర్ శిక్షణ అభినందనీయం

ప్రజాశక్తి - ఏలూరు

ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ కంప్యూటర్ శిక్షణ కేంద్రం ద్వారా విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు, నిరుద్యోగ యువత కోసం ఐదు రకాల కోర్సులు నైపుణ్యంగా నేర్పడం అభినందనీయమని నీటిపారుదల శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు అన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ కంప్యూటర్ శిక్షణ పొందిన 20వ బ్యాచ్ వారికి సర్టిఫికెట్లు ప్రదానం పవర్‌పేటలో అన్నే భవనంలో గుడిపాటి నరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. 20 మందికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా కె.శ్రీనివాసరావు, నీటి పారుదల శాఖ డిప్యూటీ ఇంజినీర్ వై.అర్జునరావు, హేలాపురి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, రిటైర్డ్ హెడ్ మాస్టర్ పి.కస్తూరిబాయి, శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ బి.పూర్ణచంద్, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు ఎస్.రవి, డి.గణేష్ పాల్గొన్నారు.

విద్యాశాఖ ప్రగతిపై సమీక్ష

ప్రజాశక్తి - భీమడోలు

మండల పరిధిలోని డ్రాప్ అవుట్ విద్యార్థులు తిరిగి పాఠశాలలో కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని భీమడోలు ఎంపిడిఒ రాఘవన్ కోరారు. రానున్నకాలంలో విద్యాశాఖ ద్వారా అమలు జేయనున్న వివిధ అంశాలపై స్థానిక మండల వనరుల కేంద్రంలో శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మండల విద్యాధికారి డి.సాంబశివరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపిడిఒ మాట్లాడుతూ మండల పరిధిలో 15 మంది డ్రాప్ అవుట్ విద్యార్థులు ఉన్నట్లు గుర్తించామన్నారు. సదరు విద్యార్థులు గల పాఠశాల ప్రధానోపాధ్యాయులు మే ఒకటో తేదీన ఏలూరులోని గోదావరి సమావేశం మందిరంలో జిల్లా అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి పూర్తిస్థాయి డ్రాప్ అవుట్ విద్యార్థుల వివరాలతో హాజరుకావాలని కోరారు. మండల పరిధిలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్‌ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. ఈ నెల 29వ తేదీన ప్రతి పాఠశాలలో విధిగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో 80 శాతం తక్కువ కాకుండా విద్యార్థులు భోజనాలు స్వీకరించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని అన్ని పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయానికి చెందిన విద్యా సంక్షేమ వాలంటీర్లు హాజరయ్యారు.

విద్యార్థులకు దేహ దారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని కృష్ణారావుపేట మండల ప్రజా పరిషత్ పాఠశాల విద్యార్థులకు అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న విద్యార్థులకు ప్రభుత్వ వైద్య సిబ్బంది శుక్రవారం హిమోగ్లోబిన్, బరువు, ఎత్తు, పరీక్షలు నిర్వహించారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. శరీరానికి సరిపడా పౌష్టికాహారం అందని విద్యార్థులకు మెడికల్ సిబ్బంది మందులు అందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణారావుపేట ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్‌కె.జమీల, హెచ్‌వి వై దుర్గాభవాని, ఎంఎల్‌హెచ్‌పి కె.దుర్గారావు, హెల్త్ అసిస్టెంట్ బి.విశ్వం, ఆశా వర్కర్ రమాదేవి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ థామస్ పాల్గొన్నారు.

పలుగ్రామాల్లో' గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని బోరవంచ, రామన్నగూడెం, వట్టిగుడిపాడు పలు గ్రామాల్లో ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఇంటింటికి వెళ్లి జగనన్న అందిస్తున్న పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సచివాలయంలో ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు మండల పరిధిలోని తుక్కులూరు, అన్నవరం, రావిచర్ల పలు గ్రామాల్లో సచివాలయాలను ఎంపిడిఒ సుందరి శుక్రవారం తనిఖీ చేశారు. గ్రామాల్లోని జగనన్న కాలనీల లబ్ధిదారుల జాబితాను, సచివాలయ సిబ్బంది హాజరు పట్టీని క్షుణ్ణంగా పరిశీలించారు. సచివాలయ ఉద్యోగుల డ్రెస్ కోడ్‌ను ఎంతమంది పాటిస్తున్నారో పరిశీలించారు. సచివాలయ ఉద్యోగుల జాబు చార్ట్‌పై ఆదేశాలు జారీ చేశారు.

1న వేలం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని పోలవరం పంచాయతీ కార్యాలయం వద్ద మే ఒకటో తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు వేలం పాటలు నిర్వహించనున్నట్లు పంచాయతీ సెక్రటరీ వై.కొండలరావు తెలిపారు. పంచాయతీ సర్పంచి పొడుం పుష్ప అధ్యక్షతన డైలీ మార్కెట్, వారపు సంత, పాత ఇనుప సామానం, కబేలా, కొబ్బరి చెట్లకు సంబంధించిన వేలం పాటలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు. వివరాలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

కుమారుడు కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదు

ప్రజాశక్తి - ముసునూరు

కుమారుడు కనిపించడంలేదని తండ్రి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ముసునూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన సరస్వతి ప్రవీణ్‌కుమార్ సిపి సీడ్ మొక్కజొన్న కంపెనీలో నాలుగేళ్ల నుంచి ఆర్గనైజర్‌గా పని చేస్తున్నాడు. అదే కంపెనీలో బర్మా సాయి, ఉదయ్ అనే ఇద్దరు వ్యక్తులు క్యాషియర్, కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నారు. వీరివురు కలిసి తన కుమారుడు ప్రవీణ్‌కుమార్‌కు తెలియకుండా కొన్ని దొంగ లెక్కలు చూపి ఆ సిపి కంపెనీలో కొంత నగదు దోచుకుని ప్రవీణ్‌కుమార్‌పై పెట్టారన్నారు. ఆ సిపి కంపెనీవారు తన కుమారుడిని ఆ సొమ్ము కట్టాలని ఒత్తిడి పెడుతున్నారన్నారు. ఈ క్రమంలో ఈ నెల 24వ తేదీన తమ ఇంటి వద్దకు బర్మా సాయి, ఉదయ్ వచ్చి ముగ్గురం కలిసి సొమ్ము కడతామని చెప్పి తన కుమారుడిని తీసుకెళ్లారన్నారు. మళ్లీ తన కుమారుడు తిరిగి రాలేదని చెప్పారు. శుక్రవారం ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎం.కుటంబరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్లకు నిప్పు పెట్టిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని తుక్కులూరు గ్రామంలో స్థలం తగాదా విషయంలో చెట్లకు నిప్పు పెట్టిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నూజివీడు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ గౌడ్ తెలిపారు. చెట్లకు నిప్పు పెట్టిన అచ్చి నాగరాజుపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమైనట్లు తెలిపారు.

మేడే జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కామవరపుకోట

కార్మికుల దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సిఐటియు మండల టౌన్ కమిటీల సమావేశం షేక్ సుభాషిని అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ కార్మికుల దినోత్సవం మే డే ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్మికులు పోరాటం చేసి 16 గంటల పని దినాన్ని ఎనిమిది గంటల పని దినంగా సాధించుకున్న మొదటి విజయంగా ఈ మేడే చెప్పవచ్చని ఆయన తెలిపారు. మేడే సందర్భంగా కామవరపురకోట పట్టణంలో, గ్రామాల్లో జెండా ఆవిష్కరణలు చేయాలని, భారీ ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు.



మండవల్లిలో...

మండవల్లి : కార్మికుడు ఎనిమిది గంటలు మాత్రమే పని చేయాలని పోరాడి సాధించుకున్న ఫలితమే మేడే అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు విజయలక్ష్మి స్పష్టం చేశారు. స్థానిక శిశు సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం మేడే పోస్టర్‌ను అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులు హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసి ఎనిమిది గంటల పని దినాన్ని సాధించుకున్నారన్నారు. సంఘటితంగా పోరాడితే సమస్యలు పరిష్కారమవుతాయని నిరూపించబడిందన్నారు. ఈ పోరాటంలో ఎంతోమంది అమరులయ్యారన్నారు. అప్పటి నుంచి ప్రపంచమంతా ఎనిమిది గంటల పని దినాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఈ సంవత్సరం మేడే వారోత్సవాలు జెండా ఆవిష్కరణతో ప్రారభించి ఊరేగింపులు, సభలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి చెల్లమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం లీడర్స్ వాణి, ఉమాదేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

చింతలపూడి : ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సిఐటియు మండల నాయకులు శుక్రవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కులను కుదించివేస్తున్న నేటి తరుణంలో ప్రపంచవ్యాప్తంగా కార్మిక ఉద్యోగ వర్గాలు తిరుగుబాటు బావుటా ఎగరవేస్తున్నాయని, పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వాలకు నిరసన తెలియజేస్తున్నాయని తెలిపారు. అనేక పరిశ్రమలను ప్రయివేటు పరం చేయడానికి బెజెపి కంకణం కట్టుకుందన్నారు. బడా పారిశ్రామిక వేత్తలకు లాభాలు ఆర్జించి పెట్టడానికి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తున్నాయన్నారు. మేడేను స్ఫూర్తిగా తీసుకొని కార్మిక వర్గం ఒక్కటై మేడే ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్‌డి.జఫ్రుల్లా, సిఐటియు మండల అధ్యక్షులు నత్తా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి, ఎం.బాలరాజు, అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు ఎన్.సరోజిని, టి.మాణిక్యం, అరుణ, కవిత, సరళ, పద్మ ,ఆశ వర్కర్స్, యూనియన్ మండల కార్యదర్శి సరళ కుమారి పాల్గొన్నారు.



ఆగిరిపల్లిలో...

ఆగిరిపల్లి : ప్రపంచ కార్మిక దినోత్సవం (మేడే) వేడుకలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు జి.రాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆగిరిపల్లిలోని సిఐటియు కార్యాలయంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తు కోటేశ్వరరావు, చాకిరి శివనాగరాజు, షేక్ జహాంగీర్ బాషా, ఏపూరి రవీంద్ర, బండి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

లబ్ధిదారులపై సచివాలయ కార్యదర్శి వేధింపులు దారుణం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని మైసన్నగూడెం గ్రామంలో జగనన్న గృహ లబ్ధిదారులపై కక్ష సాధింపుతో వేధిస్తున్న సచివాలయ కార్యదర్శి వరలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో మండల కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి బి.రాంబాబు అధ్యక్షత వహించగా పార్టీ మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడారు. జగనన్న గృహ దళిత లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేయకుండా మైసన్నగూడెం గ్రామ సచివాలయ కార్యదర్శి వరలక్ష్మి కక్షపూరిత వేధింపులు చేయడం దుర్మార్గమన్నారు. జగనన్న శాశ్వత గృహం ఇంటి నిర్మాణంలో భాగంగా మైసన్నగూడెం గ్రామంలో దళిత సామాజిక తరగతికి చెందిన పిల్లి వసంతరావుకు ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసి ఎంజాయ్‌మెంట్ ధ్రువపత్రం అందించగ అధికారులు చూపిన హద్దుల్లో ఇంటి నిర్మాణం చేపట్టారని తెలిపారు. స్లాబ్ వరకు ఇంటిని నిర్మించినప్పటికీ మొదటి బిల్లు రూ.ఐదు వేలు మాత్రమే విడుదల చేశారని తెలిపారు. నాలుగు దఫాలుగా బిల్లు రావాల్సి ఉండగా నేటికీ బిల్లులు విడుదల చేయకుండా వసంతరావును ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తూ కక్ష సాధింపు చేయడం సరికాదన్నారు. రూ.రెండు లక్షలకు పైగా ఇంటికి అప్పుచేసిన వసంతరావు బిల్లులు మంజూరు చేయాలని పలుమార్లు కార్యదర్శి వరలక్ష్మిని అడగగా బాధితునిపై దుర్భాషలాడుతూ తమతో సెటిల్‌మెంట్ చేసుకోకపోతే మీ ఇంటికి బిల్లు రాదని మాట్లాడటం దుర్మార్గమన్నారు. సచివాలయ కార్యదర్శి వరలక్ష్మిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గత నాలుగేళ్ల నుంచి మైసన్నగూడెం సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తున్న వరలక్ష్మిపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. నకిలీ రసీదులతో ఇసుక రవాణా, ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా గ్రామంలో స్కూల్ భవనాలను కూల్చివేయడం, గ్రామ పంచాయతీకి సంబంధించిన చెరువులను వేలంపాట పెట్టకుండా భూ స్వాములకు అడ్డదారిన అప్పగించడంపై గ్రామస్తులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. అయినప్పటికీ నేటికి ఆమెపై చర్యలు తీసుకోకపోవడం అధికారుల ఉదాసీనతకు దర్పణం పడుతుందని విమర్శించారు. జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి కార్యదర్శి వరలక్ష్మిని విధులు నుంచి తొలగించాలని పంచాయతీ నిధులపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. బాధితుడు పిల్లివసంతరావుకు ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహాయాన్ని అందించాలని, లేకపోతే మండలంలోని పేదలను ఐక్యం చేసి ఆమెపై చర్యలు తీసుకునే వరకు ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జోడి సూర్యచంద్ర, ఎం.ప్రభాకరరావు, పి.సత్తిబాబు, ఆనందరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి : డిఎంహెచ్ఒ



ర్యాలీలో డిఎంహెచ్ఒ ఆశ


ప్రజాశక్తి - దెందులూరు

ప్రజలు తమ సామాజిక బాధ్యతగా భావించి పరిసరాల పరిశుభ్రత పాటించినట్లయితే దోమల వ్యాప్తిని తగ్గించుకోవచ్చని, తద్వారా డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులు మన దరి చేరవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.ఆశ సూచించారు. మండలంలోని గోపన్నపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న వీరభద్రపురంలో డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలిస్తూ ప్రజలు చెత్తాచెదారాల్ని డ్రెయిన్‌లో వేయరాదని, తమ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వారానికి ఒకసారి నీటి నిల్వ ప్రాంతాలైన నీళ్ల తొట్టెలు, డ్రమ్ములు, ఓవర్ హెడ్ ట్యాంకులు, రుబ్బురోలు, గ్రైండర్లు, ఎయిర్ కూలర్స్ శుభ్రం చేసుకోవాలని మూతలు పెట్టుకోవాలని చెప్పారు. దోమల గృహాల్లోకి ప్రవేశించకుండా సాయంత్ర సమయంలో కిటికీలు వేయాలని దోమతెరలు వాడాలని, దోమలు రాకుండా వేపాకుతో పొగ పెట్టాలని, నీటి నిల్వ ప్రాంతంలో పనికిరాని ఇంజన్ ఆయిల్ పోయాలని, ఎబెట్ ద్రావణాన్ని పిచికారీ చేయించాలని సూచించారు. జిల్లా మలేరియా నివారణ అధికారి పిఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా ఉంచాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. మలేరియా కిట్లు వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లోను, గోపన్నపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిద్ధంగా ఉన్నాయన్నారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఇంటింటికి వెళ్లి ప్రజలకు దోమల పట్ల, పరిసరాల పరిశుభ్రత పట్ల, దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల, తీసుకోవాల్సిన జాగ్రత్తలు పట్ల అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె.రోజా లలిత, అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి జె.గోవిందరావు, ఆరోగ్య విస్తరణ అధికారి నాగరాజు, అనురాధ, భార్గవి, హెల్త్ అసిస్టెంట్స్ రమేష్, శ్రీనివాస్, ఆదినారాయణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరు సిల్క్ నగర్ ఫౌండేషన్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొప్పుల బాబురావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు పాటలు, డ్యాన్సులతో అలరించారు. అనంతరం వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందించారు.



దీపికను సత్కరిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

అంతర్జాతీయ కిక్ బాక్సింగ్‌కు గొల్లపల్లి విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మే పదో తేదీ నుంచి 20వ తేదీ వరకు నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు గొల్లపల్లి శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని దాసరి దీపిక ఎంపికైంది. ఈ నేపథ్యంలో శుక్రవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని రాధికరాణి ఆధ్వర్యంలో దీపికను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యా కమిటీ ఛైర్మన్ పల్లగాని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దీపిక అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనటం గర్వకారణమన్నారు. విద్యార్థినికి స్థానిక రాజకీయ నాయకులు రంగారావు రూ.ఐదు వేలు, ఉపాధ్యాయులు రూ. ఎనిమిది వేలు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి రెడ్డి మధుబాబు, ఉపాధ్యాయులు రవీంద్ర, నాగిరెడ్డి, మల్లీశ్వరి, పద్మ సుశీల కుమారి, మనోహరం, కృష్ణవేణి, దుర్గారాణి పాల్గొన్నారు.

అప్ప వసూలు చేయటమే లక్ష్యం : ఎపిఎం

ప్రజాశక్తి - చాట్రాయి

మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న పాత బకాయిలు వసూలు చేయడమే లక్ష్యంగా పని చేయాలని ఎపిఎం టి.శేఖర్ సిబ్బందిని కోరారు. మండలంలోని వైఎస్ఆర్ కాంతి పథం మహిళా సమైక్య కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ మండలంలో రూ.74 లక్షలకు పైగా పాత బకాయిలు కొన్ని సంవత్సరాలుగా పేరుకుపోయాయని, ప్రతి రూపాయి వసూలు చేయడమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో మహిళాసంఘాలు, సీసీలు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

అధికారులందరూ సమన్వయంతో పని చేస్తూ మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపిడిఒ ఎన్‌టి.స్వామి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గృహ నిర్మాణ లబ్ధిదారుల ఇ కెవైసి పూర్తి స్థాయిలో నమోదు చేయాలని తెలిపారు. ఐదేళ్ల లోపు గల పిల్లలకు ఆధార్ నమోదు చేయాలని, ఆరు నుంచి 19 ఏళ్ల వయస్సు గల వారికి, గర్భిణులకు, బాలింతలకు నూరు శాతం ఆధార్ అప్‌డేట్ అయ్యేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి మార్కుల జాబితాలను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల్లో నాడు-నేడు పనులపై ప్రగతి నివేదికలు తయారు చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయం సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ ఎన్‌టి.స్వామి

'దామాషా పద్ధతి ఎన్నికలే మేలు '

ప్రజాశక్తి - మండవల్లి

ధనంతో ప్రలోభ పెట్టే రాజకీయ వ్యవస్థ పోవాలన్నా, వినియోగించుకున్న ప్రతి ఓటుకు చట్టసభలో ప్రాతినిధ్యం లభించాలన్నా దామాషా పద్ధతి ఎన్నికలే మిన్నా అని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్‌ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. భైరవపట్నం సచివాలయంలో మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఓటు హక్కు ఎన్నికల విధానంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మనదేశంలో ఫస్ట్ పాస్ ది పోస్ట్(ఎఫ్‌పిటిపి) పద్ధతిలో ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. దామాషా పద్ధతి ఎన్నికలు వస్తే ధన, కుల ప్రభావం ఉండదన్నారు. ఈ పద్ధతి ద్వారా ఎన్నికలు నిర్వహిస్తే ప్రజలు పార్టీలకే ఓట్లు వేస్తారని ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తే ఆ దామాషాలో ఆ పార్టీకి సీట్లు వస్తాయన్నారు. పార్టీ ప్రకటించిన వరుస క్రమంలో అభ్యర్థులు చట్టసభ సభ్యులవుతారని తెలిపారు. ఎన్నికల సంస్కరణలపై ప్రజలను చైతన్యపరిచే విధంగా గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామఅన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సామ్రాజ్యవాణి, ఎంపిటిసి సభ్యులు కిరీటి రాజు, గ్రామ ప్రముఖులు బి.రత్నకుమార్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

జగనన్న ఇళ్ల లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపిడిఒ పి.మల్లీశ్వరి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో ఆమె శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్లు కట్టుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో నాడు-నేడు కింది పాఠశాలాల్లో జరుగుతున్న పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ కె.శ్రీనివాస్, హౌసింగ్ ఎఇ శేషగిరిరావు పాల్గొన్నారు.

వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి

ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు

ప్రజాశక్తి - ముదినేపల్లి

వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని వణుదుర్రు, చేవూరు, సీతారామపురం గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధిని వైసిపి ప్రభుత్వం చేసిందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని టిడిపి నాయకులు అనేక విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రజలు వాస్తవ పరిస్థితులు గమనిస్తున్నారన్నారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా మరోసారి అవకాశం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, గంటా సంధ్య, వైస్ ఎంపిపిలు సునీత, రాధా, పార్టీ మండల అధ్యక్షులు ఎం.ఏసుబాబు, ఆయా గ్రామాల సర్పంచులు వి.లక్ష్మి, ఈడే నాగమణి, పేరే రామకృష్ణ ఎంపిటిసి సభ్యులు, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వికలాంగుడికి వీల్‌చైర్ అందజేత

ప్రజాశక్తి - చింతలపూడి

మాట్లాడే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్నా అని చింతలపూడి టిడిపి నియోజకవర్గ కన్వీనర్ పల్లి శ్రీను అన్నారు. మండలంలోని పోనుకుమాడు గ్రామంలో మానసిక వికలాంగుడైన వెంకటకిషోర్‌కు రాధమ్మ ఆర్థిక సాయంతో వీల్‌చైర్‌ను అందించారు. ప్రగడవరం గ్రామ అధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్‌రెడ్డి, చినబాబు చేతులమీదుగా శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బుద్దాల నాగవర్ధన్, వార్డ్ మెంబర్ నల్లగోపు కృష్ణమూర్తి, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ బిసి సెల్ ప్రధాన కార్యదర్శి కొప్పెర్ల నాగరాజు, ఎన్ఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు కొమ్ము తిరుపతిరావు, చక్రపు మారేశ్వరావు, మానేపల్లి రాజారావు, తిరువీధుల రాజా పాల్గొన్నారు.

1 నుంచి లీటరు పాల ధర రూ.80

ప్రజాశక్తి - చాట్రాయి

తిరువూరు క్లస్టర్ చాట్రాయి బిఎంసి పరిధిలోని 23 పాల సంఘాలకు 2022-2023వ సంవత్సరం మూడో విడత ధర వ్యత్యాసం శుక్రవారం పంపిణీ చేశారు. చాట్రాయి వరకు రూ.38.50 లక్షలు తిరువూరు పాలశీతల కేంద్రం మేనేజర్ టి.సాంబశివమూర్తి పంపిణీ చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం మూడు దఫాలుగా ధర వ్యత్యాసం రూ.6.77 కోట్లను తిరువూరు మొత్తంగా పంపిణీ చేశారు. చాట్రాయికి రూ.1,03,75,390 పంపిణీ చేశారు. రైతు శ్రేయస్సు దృష్ట్యా మే ఒకటో తేదీ నుంచి రూ.2 రేటు పెంచుతూ మొత్తం పాలధర రూ.80గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంతర పంటలపై అవగాహన

ప్రజాశక్తి - చింతలపూడి

చిన్న మొక్కల పామాయిల్ తోటల్లో అంతర పంటలు వేసే రైతులు అవగాహన కలిగి ఉండాలని గోద్రెజ్ ఆయిల్‌పామ్ ఆర్‌అండ్‌డి హెడ్ డాక్టర్ జి.రమేష్ అన్నారు. మండలంలోని వెంకటాపురంలో పామాయిల్ తోటలో అంతర పంటలపై గోద్రెజ్ పామాయిల్ ఫ్యాక్టరీ మండల ఇన్‌ఛార్జి వి.శ్యామ్ అధ్యక్షతన శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. వెంకటాపురం గ్రామంలో ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో పామాయిల్ కాటా ఏర్పాటు చేస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాటా ఏర్పాటు చేయడానికి ల్యాండ్ కన్వర్షన్ జరుగుతుందని, ఆ పని పూర్తయిన వెంటనే వేబ్రిడ్జి ఏర్పాటు చేస్తామని గోద్రెజ్ పామాయిల్ ఫ్యాక్టరీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి ఇన్‌ఛార్జి డాక్టర్ బి.నాగార్జున, ప్రసాద్ స్వామి, బి.జ్యోతి, రైతులు శ్రీను, మాదాసు రాంబాబు, మాదాసు పున్నయ్య, ఆలేటి ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని గొల్లపల్లి, మీర్జాపురం, పల్లెర్లమూడి ప్రభుత్వ పాఠశాలలో ఈ నెల 29న పేరెంట్స్ మీటింగ్ నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. విద్యార్థులకు తుది పరీక్షలు పూర్తి కావడంతో విద్యార్థి సామర్థ్యం, ఏ అంశాల్లో వెనకబడ్డారో, వేటిలో మెరుగుపడాల్సి ఉందో వివరాలను తల్లిదండ్రులకు టీచర్లు వివరించాలని మండల విద్యాశాఖ ఇన్‌ఛార్జి బి.వెంకటేశ్వర్లు తెలిపారు.

చేబ్రోలులో 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని చేబ్రోలులో శుక్రవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు ఇంటింటికి వెళ్లి పథకాల బ్రోచర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి పలు వినతులు విజ్ఞాపనలు స్వీకరించారు. ఆయనతో పాటు ఎంపిటిసి సభ్యులు మనసాల నాగమణి, రాయి లక్ష్మి, నాయకులు ఆకుల రాజా, పాపారావు బాబ్జి, కరణం బుజ్జి, పార్టీ గ్రామ అధ్యక్షులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు పాఠశాలలో అదనపు తరగతి గదులు ప్రారంభం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని జెడ్‌పి హైస్కూల్‌లో నాబార్డు నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను శనివారం ఉదయం ఎనిమిది గంటలకు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ప్రారంభించనున్నారు. ప్రస్తుతం ఉన్న పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో నూతనంగా అదనపు తరగతి గదులను నిర్మించారు. ఈ అదనపు తరగతి గదులను ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ప్రారంభించనున్నారు. ఆనంతరం శనివారం నుంచి ముదినేపల్లిలో జరిగే డిఎన్ఆర్ ప్రీమియం లీగ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభిస్తారు.